క్లుప్తంగా

ఆక్రమణ భూముల్లో హెచ్చరిక బోర్డులు

శృంగవరపుకోట: మండలంలోని జిరాయితీ కుమరాం గ్రామంలో ఆక్రమిత భూములను పరిరక్షించేందుకు ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సర్వే నంబర్ 4లో సుమారు 1.68 ఎకరాల విస్తీర్ణం ఉన్న అమ్మచెరువులో ఆక్రమణలను గుర్తించి, సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి


అప్పారావు (ఫైల్)

జామి: మండలంలోని బలరాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న గర్భాన ఎర్ని అప్పారావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతుడికి భర్యా విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల యూటీఎఫ్ మండ ల శాఖ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలియ జేయడంతో పాటు తక్షణ ఖర్చుల నిమిత్తం రూ. 15 వేలు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీ ఆర్కే ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు, మండల ప్రధా న కార్యదర్శి ఎం.తాతంనాయుడు, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'స్పందన'ను సద్వినియోగించుకోండి

గజపతినగరం: ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 'స్పందన'కు ఆమె హాజరయ్యారు. పలుసమస్యలపై ప్రజలు అందించిన వినతులను అధికారులు స్వీకరించారు. స్పందనలో అందే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని మండల అధికారులను ఆమె ఆదేశించారు. ఈఓపీఆర్డీ జనార్దనరావు పాల్గొన్నారు.

పుస్తక అక్రమ అమ్మకాలను అడ్డుకోండి

శృంగవరపుకోట: మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలలు పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నాయని, తక్షణమే అడ్డుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.రమేష్ విద్యాశాఖ అధికారులను కోరారు. పోతనాపల్లి పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు అధిక ధరలకు పుస్తకాలు అంటగడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధి కోసం అహర్నిశలూ కృషి చేస్తుంటే.. అధికారులు ప్రైవేటు పాఠశాలల దందాను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పుస్తక అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రిషి, రామునాయుడు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలకు దరఖాస్తులాహ్వానం


మెరకముడిదాం/ చీపురుపల్లిరూరల్: ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించి ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్టు సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెరకముడిదాం మండలంలోని గొల్లలవలస, చీపురుపల్లి మండలం రామలింగాపురంనకు సంబంధించి ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, ఆసక్తి ఉన్న వారు ఎంపీడీఓలను, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహం కూల్చడం తగదు


మాట్లాడుతున్న దళిత నాయకులు

లక్కవరపుకోట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం కూల్చడం హేయమైన చర్య అని జిల్లా దళిత సంఘ నాయకులు పేడ సూరిదేముడు, ఆతవ ఉదయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని కొట్యాడ గ్రామంలో నాలుగు రోజుల కిందట అంబేడ్కర్ విగ్రహాన్ని కొంతమంది ఆకతాయిలు కూల్చివేశారు. ఈ మేరకు వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, విగ్రహం కూల్చిన ప్రదేశంలోనే అధికారులు కొత్త విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డప్పు రాజు, గాలి చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం


జలాభిషేకంలో పాల్గొన్న మహిళలు

దత్తిరాజేరు: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని గడసాం గ్రామంలోని శివాలయంలో శివలింగానికి మహిళలు సోమవారం జలాభిషేకం చేశారు. గ్రామ మహిళలు బిందెలతో నీరు తీసుకుని ఆలయానికి వచ్చారు. వారితో అర్చకులు నరేష్ సిద్ధాంతి ప్రతేక పూజలు, శివలింగానికి జలాభిషేకం చేశారు.


జామి: కుమరాం కేజీబీవీలో విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీటీసీ పద్మావతి


చీపురుపల్లిరూరల్: గరివిడి కేజీబీవీలో విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు


బొండపల్లి: గొట్లాంలో విద్యార్థులను సత్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ, నాయకులు

చదువుతోనే బంగారు భవిష్యత్

● 'జగనన్న ఆణిముత్యాలు'కు సన్మానం

చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో విద్యార్థులంతా చక్కగా చదువుకోవాలని ప్రజాప్రతినిధులు, ఎంఈఓలు ఉపాధ్యాయులు అన్నారు. పదోతరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట సన్మానిస్తోంది. పాఠశాలస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను పలు పాఠశాలల్లో సోమవారం సన్మానించారు. – సాక్షి నెట్‌వర్క్


బొండపల్లి: దేవుపల్లిలోని కేజీబీవీలో విద్యార్థినులను సత్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు,ఉపాధ్యాయులు


మెరకముడిదాం: గర్భాం మోడల్ స్కూల్‌లో విద్యార్థినికి నగదు, ప్రశంసాపత్రం అందజేస్తున్న నాయకులు


జామి: కుమరాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు


గజపతినగరం రూరల్: జిన్నాం హైస్కూల్‌లో విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న గ్రామ పెద్దలు


లక్కవరపుకోట: కేజీబీవీ విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు


చీపురుపల్లి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శిరీష , నాయకులు



గుర్ల కేజీబీవీ విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు నగదు అందజేస్తున్న నాయకులు


దత్తిరాజేరు కేజీబీవీలో విద్యార్థినులను సన్మానిస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

చీపురుపల్లి: మత్తుపదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్' అనే పేరుతో పట్టణంలో సోమవా రం ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలే తప్ప చెడు వ్యసనాల వైపు దారి మళ్లకూడదని చెప్పారు. మత్తు పదార్థాలు వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగానికి, విక్రయాలకు పాల్పడితే 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజేశ్వరి

దత్తిరాజేరు: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుసంధానంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష' పై పెదమానాపురం సచివాల యంలో పంచాయతీ కార్యదర్శి వాసంతి అధ్యక్షతన జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి పెదమానాపురం, దాసరిపేట వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం ముఖ్యఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ నెల 23వ తేదీన సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అదేరోజు గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవాలని, అర్హత ఉండి పథకాలు అందని వారుంటే గుర్తించాలని చెప్పారు. పథకాల కోసం అవసరమైన ధ్రువపత్రాలను సచివాలయాల ద్వారా ఇప్పించాలని సూచించారు.

ఆటపాటలతో బోధన


తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేపాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం, ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన జనబాగీదారి కార్యక్రమంపై వేపాడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు వేపాడ, వల్లంపూడి అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం అవగాహన కల్పించారు. డిపార్ట్‌మెంట్ పీపీ-1, పీపీ-2, వర్క్ బుక్స్, యాక్టివిటీబుక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను చిన్నారుల కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిందని చెప్పారు.

47 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: అక్రమంగా తరలిస్తున్న 47 మద్యం బాటిల్స్‌ను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష సోమవారం తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నారని స్థానికుల ద్వారా అందిన సమాచారం మేరకు వంగర గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శిరీష చెప్పారు.

చీపురుపల్లిలో మరో 47 మద్యం బాటిల్స్

చీపురుపల్లి: అనధికారికంగా మద్యం బాటిల్స్ రవాణా చేసినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా కేసులు నమోదు చేయడం తప్పదని ఎస్సై ఎ.సన్యాశినాయుడు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన దాడుల్లో పట్టణంలోని రాధామాధవ్ ఫంక్షన్ హాల్ సమీపంలో 47 మద్యం బాటిల్స్ రవాణా చేస్తున్న గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన గవిడి సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు.

మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న సత్యనారాయణపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరచనున్నట్లు చెప్పారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ, నాయకుడు తులసీరాం

బొండపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సాగు సంబంధ సేవలన్నీ గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా ప్రభుత్వం అందిస్తోందని గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం అన్నారు. గొట్లాం గ్రామంలోని ఆర్బీకే లో రైతులకు రాయితీపై వరి విత్తనాలను సోమవా రం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ ఇబ్బందులు తొలగాయన్నారు. విత్తనాలు, ఎరువులను గ్రామాల్లోని ఆర్బీకేల్లోనే అందిస్తుండడంతో పాటు పంట కొనుగోళ్లు చేపడుతున్నట్లు చెప్పారు. వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి


పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఎంపీపీ జ్ఞానదీపిక, జెడ్పీటీసీ తవుడు

గజపతినగరం: పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, సమష్టిగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులంతా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం ఇతర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గ్రామ సచివాలయాల్లో ఏమైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈఓపీఆర్డీ జనార్దనరావుపాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు


మాట్లాడుతున్న ఆశయ సంస్థ రమణ

చీపురుపల్లిరూరల్: మితిమీరిన ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి పెనుముప్పు పొంచి ఉందని, ప్లాస్టిక్ వినియోగానికి ప్రజలు స్వస్తి పలకాలని చీపురుపల్లి పట్టణానికి చెందిన ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై మండలంలోని అలజంగి పంచాయతీ పరిధి ఎలకలపేట గ్రామంలో ప్రజలకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో భూకాలుష్యం, జల కాలుష్యం పెరిగిపోతోందని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మూగజీవులు తిని రోగాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నాయని అన్నారు. పశువులు ప్రాణాంతక రోగాల బారిన పడటానికి,పర్యావరణం దెబ్బతినడానికి ప్లాస్టిక్కే ప్రధాన కారణమని చెప్పారు. ప్లాస్టిక్ వాడకానికి అంతా దూరంగా ఉండాలని అన్నారు. ఆశయ సంస్థ ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు


ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

శృంగవరపుకోట: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను ఎస్.కోట పట్టణంలో ఆ పార్టీ నేతలు సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ నేత హనుమాలశెట్టి నానాజీ నేతృత్వంలో పదాల మణిబాబు, తదితరులు అంతా కలిసి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

బాధ్యతల స్వీకరణ..

కొత్తవలస:

మండల రెండో విద్యాశాఖాధికారి(ఎంఈఓ)గా బండారు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎల్.కోట మండలం కళ్లేపల్లి-రేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఎంఈఓ-2గా కొత్తవలస వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందించారు.

అభినందనలు...

లక్కవరపుకోట: మండల రెండో విద్యాశాఖాధికారిగా జి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీపురుపల్లి మండలం నుంచి ఉద్యోగోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఎంఈఓ కూర్మారావుతో పాటూ పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

వేపాడలో..

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన పి. బాలభాస్కరరావు వేపాడ ఎంఈఓ -2గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

మెరకముడిదాం ఎంఈఓ-2 గా ప్రసాద్

మెరకముడిదాం: మండల ఎంఈఓ-2గా ఉత్తరావల్లి ఉన్నతపాఠశాల హెచ్ఎం మండాప్రసాద్ నియమితులయ్యారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు.


మెరకముడిదాం ఎంఈఓ-2 గా బాధ్యతలు స్వీకరిస్తున్న మండా ప్రసాద్

బొండపల్లి ఎంఈఓ-2గా వెంకటరమణ


బొండపల్లి ఎంఈఓ-2 వెంకటరమణ

బొండపల్లి: మండల రెండో విద్యాశాఖాధికారిగా అల్లు వెంకటరమణ స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదివరకు దత్తిరాజేరు మండలం గడసాం ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేశారు.

వేపాడ తహసీల్దార్‌గా ప్రసన్న కుమార్

వేపాడ: మండల తహసీల్దార్‌గా కె.ప్రసన్నకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఎస్.కృష్ణంరాజు రాజాం బదిలీపై వెళ్లడంతో విశాఖపట్నం కలెక్టరేట్ సివిల్ డిఫెన్స్ లో ఉపతహసీల్దార్‌గా పనిచేసిన ప్రసన్నకుమార్ పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు.

దత్తిరాజేరు తహసీల్దార్‌గా గురుమూర్తి

దత్తిరాజేరు: మండల తహసీల్దార్‌గా గురుమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇది వరకు విశాఖ కలెక్టరేట్‌లో డీటీగా పని చేసి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేసిన రమేష్ డీటీగా కొనసాగనున్నారు.


వేపాడ ఎంఈఓ- 2 బాలభాస్కరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు


కొత్తవలస ఎంఈఓ-2 బి.శ్రీనివాసరావు


దత్తిరాజేరు తహసీల్దార్ గురుమూర్తి


ఎల్.కోట ఎంఈఓ-2 జి.శ్రీనివాసరావు


కె.ప్రసన్నకుమార్, వేపాడ తహసీల్దార్

రథయాత్రకు ఏర్పాట్లు పూర్తి

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల ఏర్పాట్లు పూర్తయినట్లు శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ఈఓ బీఎల్.నగేష్ తెలిపారు. ఆలయం ఆవరణలో ఉన్న రథాన్ని ఉత్సవానికి ముస్తాబుచేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మంగళవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రథయాత్ర నిర్వహిస్తామన్నారు. దేవాలయం నుంచి జగన్నాథపురంలోని గుండీచ మందిరం వద్దకు తీసుకువెళ్తామన్నారు. 21 నుంచి 27వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన


పాఠశాల విద్యార్థులతో కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం ఆచార్యులు

విజయనగరం రూరల్: ప్రపంచ సికిల్‌సెల్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కొండకరకాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం సోషల్‌వర్క్ విభాగం, బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఐసీఎంఆర్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, సీటీయూఏపీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి మాట్లాడుతూ, ఈ వ్యాధి జన్యు సంబంధమైందని, ప్రాణాంతకమని తెలిపారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, గిరిజన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నగేష్, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రేమచటర్జీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చింతపల్లిపేట వాసి మృతి

యలమంచిలి : స్కూటీని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. వివరాలివి. విజయనగరం జిల్లా గుర్ల మండలం చింతపల్లిపేట గ్రామానికి చెందిన సత్తారపు చౌదరి నాయుడు(38) స్కూటీపై స్వగ్రామం వెళుతుండగా యలమంచిలి జాతీయ రహదారిపై యర్రవరం భారత్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం సాయంత్రం 7గంటల సమయంలో తుని నుంచి అనకాపల్లి వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీ పై ప్రయాణిస్తున్న చౌదరి నాయుడు తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు వచ్చి ఫిర్యాదు చేశాక కేసు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దువ్వాం పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్ము వెంకటరావు(58) సోమవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గతంలో కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పని చేశారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతికి గరివిడి మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.